# హంసలను వేటాడొద్దు [13]

మూలం: బోరిస్ వాసిల్యేవ్

అనువాదం: కె. సురేష్



**అనువాదం:** హంసలను వేటాడొద్దు [13]

**మూలం:** డోంట్ షూట్ ద వైట్ స్వాన్స్

**మూల రచయిత:** బోరిస్ వాసిల్యేవ్

**అనువాదకుడు:** కె. సురేష్

ప్రచురణ: కినిగె పత్రిక http://patrika.kinige.com

కాలం: జులై 2014

శాశ్వత లింకు : http://patrika.kinige.com/?p=2984

©Author.

**What can you do with this document?**

Read it!
Store this PDF on your device.
Share the link with your friends
Share this PDF with your friends via personal communication (e.g. email)
Take printouts for personal use

**What is not allowed by Owner of this document?**
Editing the document. No page to be removed or added.
Distributing to public (instead kindly share the link to Kinige given above)

# హంసలను వేటాడొద్దు [13]

దీని ముందు భాగం

**జరిగిన కథ:** ఫ్యోడార్ ఇపటొవిచ్ కొత్తగా వచ్చిన అటవీవార్డెను యూరీ దగ్గరకు లెక్కలు చెప్పటానికి వెళ్తాడు. యూరీ నిజాయితీ గల అధికారి. ఫ్యోడార్ ఇపటొవిచ్ ఎత్తులేవీ యూరీ ముందు చెల్లవు. అతని బుకాయింపులన్నీ తీసిపారేస్తాడు యూరీ. అతను తెచ్చిన దొంగపత్రాలను చూడనైనా చూడకుండా, అటవీ ప్రదేశానికి అకస్మాత్తుగా వెళ్లి తనిఖీ చేయాలనుకుంటాడు. అంతకుముందుగా తన తల్లి ఈ ఊళ్లో బడిపంతులమ్మ నోవా యురీవ్నాకి అందజేయమని ఇచ్చిన ఒక ప్యాకెట్టు తీసుకుని ఆమె దగ్గరకు బయల్దేరతాడు. **ఇక చదవండి:—**

## 13

యెగార్ మళ్లీ తన సహజ ధోరణిలో పడ్డాడు. యకోవ్ ప్రొకొపిచ్‌తో పనిచేసిన రోజులలో మాదిరి చెప్పిన ప్రతిదీ చేయసాగాడు, ప్రతిదీ పరుగులాంటి నడకతో చేయసాగాడు. చుట్ట విరామాలు, విశ్రాంతి లేకుండా హడావిడిగా పని ముగించిన తరువాత కాళ్లు చేతులు కడుక్కుని, తల దువ్వుకుని, చొక్కా సరిచేసుకుని నోనా యురీవ్నా ఇంటికి వెళ్లేవాడు. అతడి పెద్ద పెద్ద అంగల్లో ఏమాత్రం తడబాటు ఉండేది కాదు. తొందరపడేవాడు కానీ కంగారు ఉండేది కాదు. యజమాని మాదిరి నడిచేవాడు. అది ఒక ప్రత్యేకమైన నడక, ఇతరవాటితో గందరగోళ పడకూడదు.

ఈ స్వభావం ఇటీవలే ఏర్పడిందన్నది నిజమే. మొదట్లో, ఫిల్, క్రోక్ కొట్టిన దెబ్బలు మానకముందు యెగార్ చాలా నీరసంగానూ, విచారంగానూ ఉండేవాడు. ఒక రాత్రంతా నిద్ర లేకుండా గడిపాడు – బాధతో కాదు! చాలా కాలం క్రితమే బాధ, తనూ ఒకే మంచంలో పడుకోవాలన్న ఒప్పందం కుదుర్చుకున్నాడు. భయస్తురాలైన నోనా యురీవ్నాని మోసగించానని గ్రహించటంతో ఆ రాత్రి నిద్ర లేకుండా అటూ, ఇటూ దొర్లుతూ గడిపాడు. యెగార్ ఎన్ని సార్లు లెక్కేసినా, ఏ విధంగా లెక్కేసినా ముప్పై రూబుళ్లు చాలటం లేదు. నోనా యురీవ్నా దగ్గర ఒక్క కలప దుంగ గానీ, చెక్కముక్క గానీ లేదన్న సంగతి అతడు మరిచిపోయాడు. వాటిని కూడా కొంటే ముప్పై రూబుళ్లకు పని పూర్తిచెయ్యటం అసాధ్యం.

అయితే, తన మతిమరుపుకి అతడు నోనా యురీవ్నాని ఇబ్బంది పెట్టదలుచుకోలేదు. అది తన పొరపాటు, కాబట్టి అది తన బాధ్యత. దాంతో అతడు ఊరంతా కలియతిరిగాడు, అక్కడా, ఇక్కడా వెతికాడు. కలప కేంద్రం వద్ద కాపలా వ్యక్తిని పరిచయం చేసుకుని కీళ్లనొప్పుల గురించి మాట్లాడుతూ, అతడితో కలిసి చుట్ట కాల్చాడు...

ఆ కలప అతడికే అవసరమై ఉంటే కాపలా మనిషితో సంభాషణ కీళ్లనొప్పులు దాటి ముందుకు వెళ్లి ఉండేది కాదు. యెగార్‌కి ఆపై మాటలు దొరికేవి కావు, అతని గొంతు మరొక్కమాట పలకనని మొరాయించి ఉండేది. దాంతో సంభాషణ అంతటితో ఆగిపోయి ఉండేది. అది తన ఇల్లు ఐనట్లైతే కలప గురించి మాట్లాడటానికి బదులుగా ఇల్లు కారకుండా తన చర్మంతోనే ఎలాగో మరమ్మతు చేసి ఉండేవాడు, పైకప్పు జారిపోతున్న భాగంలో తానే స్తంభంగా నిలబడి ఉండేవాడు. కానీ, ఆ పని నోనా యురీవ్నా గదిలో చెయ్యలేదు కదా. దాంతో, ఒకవైపు నాలుక మొద్దుబారుతున్నా చుట్ట కాలుస్తున్న సమయంలో యెగార్ ఎలాగో గొంతు పెగిలించుకుని, "నాకు కొన్ని కలప చెక్కలు కావాలి. ఊఁ?"

ఆ "ఊఁ" అన్న శబ్దం యెగార్ గొంతునుంచి బయటపడగానే అది అతడిని భయపెట్టింది. అయితే, కాపలా మనిషి ఆలోచన మరొక రకంగా ఉండటంతో అతడి స్పందన మామూలుగానే ఉంది.

"ఎన్ని?"

అంతకు ముందెప్పుడూ యెగార్ తన జీవితంలో అంత వేగంగా అలోచించి ఉండడు. మరీ ఎక్కువ అడిగితే అతడు భయపడిపోయి ఏమీ దొరకకుండా పోవచ్చు. మరీ తక్కువ అడిగితే పని జరగదు. తన అనుభవ రాహిత్యంతో ఇప్పుడు ఏం చెప్పాలి?

"ఒక డజను..." కాపలా మనిషి ముఖ కవళికలు ఎలా మారతాయో చూడటానికి యెగార్ తల పైకెత్తి, కంగారుగా, "మరో అయిదు," అని జోడించాడు.

"అంటే మొత్తం పదిహేడు," కాపలా మనిషి అన్నాడు. "లెక్క సరిగా ఉండటానికి ఇరవై తీసుకో. పదికి ఒకటి చొప్పున రెండు అర లీటరు సీసాలు ఇవ్వు."

ఈ లెక్క వెయ్యటంలో అలసిపోయిన కాపలా మనిషి ఒక దుంగమీద కూలబడ్డాడు. ఈలోగా యెగార్ ఆలోచించాడు.

“అహ్, అలాగే. ఏ రకంగా ఇవ్వాలి?”

“ఒక సీసా తెచ్చెయ్యి, రెండో దానికి డబ్బులివ్వు.”

“అహ్, అలాగే!” అన్నాడు యెగార్. “మరి కలపను ఇక్కడినుంచి బయటకు చేరెయ్యటం ఎట్లా?”

“ఆ మూలనుంచి నాల్గవ స్తంభం లెక్కపెట్టు, దాని మూడవ పలక ఒక్క మేకు బలిమితో ఉంది. తెలిసిందా? పై అధికారి ఇక్కడే ఉన్నాడు కాబట్టి ఇప్పుడు వెళ్లి చూడవద్దు. రాత్రికి రా. కారుని రెండొందల గజాల అవతల ఒదిలిపెట్టు.”

“అహ్, అలాగే!” అన్నాడు యెగార్: ఎందుకో తెలియదు గానీ కారు గురించి ప్రస్తావించటంతో మాట పక్కా అనిపించింది. “నేను అర్ధరాత్రి పన్నెండు గంటలకు వస్తాను.”

“అయితే అర లీటరు సీసా, మరోదానికి డబ్బూ పట్టుకునిరా.”

“అర్థమయ్యింది. నేను వెంటనే వస్తాను.”

అతడు ఆ కలప దొడ్డినుంచి ఉత్సాహంగా బయటకు పరిగెత్తాడు. అయితే కొంత దూరం వెళ్లాడో లేదో అతడి ఉత్సాహం నీరుగారిపోయింది, ఊపిరి తీసుకోవటం కష్టమయ్యింది. అడుగు ముందుకి పడక అతడు ఆగిపోయాడు.

ఒక సంవత్సర కాలంగా అతడి జేబు ఒక పాట, ఒక ప్రార్ధన తప్పించి మరోదానిని చూడలేదు. కొంత పొగాకు ఉండేదనుకోండి, అంతే. అతడు డబ్బుని ఎప్పుడూ గుప్పెట్లో పట్టుకునేవాడు. అది ఇంటికి తీసుకెళ్లే జీతమైనా సరే, మద్యం కొట్టుకి తీసుకెళ్లే ముగ్గురి మిత్రులలోని తన వాటా అయినా సరే. ఇప్పుడు అతడికి ఆరు రూబుళ్లు కావాలి. ఆరు రూబుళ్లు, మణుగు బెరడు విలువ.

యెగార్ చాలా విచారంగా మారిపోయాడు. నోనా యురీవ్నాని అడగటమంటే ఆమె నుంచి మప్పై రూబుళ్లకు మించి తీసుకోవటం అవుతుంది. ఎవరైనా స్నేహితుడి దగ్గర అప్పు తీసుకోవటమా? అతడికి అప్పు ఇచ్చేవాళ్లు ఎవ్వరూ లేరు. ఆ డబ్బులు నేలలోంచి కూడా పుట్టుకుని రావు. యెగార్ నిట్టూర్చాడు. ఉన్నట్టుండి ఏదో నిర్ణయానికి వచ్చినవాడికి మల్లే తన ఇంటివైపుకి చురుగ్గా నడవసాగాడు.

ఇదంతా శనివారంనాటి విషయం. దాంతో హారిటీనా ఇంటిపనిలో హడావిడిగా ఉంది. ఆమె బట్టలు ఉతుకుతుండటంతో ఇంటినిండా ఆవిరి కమ్ముకుని ఉంది. బట్టల టబ్బు దగ్గర ఆమె చమటలతో, ముఖం ఎర్రబడి, అలసిపోయి ఉంది. ఆమె తనలో తాను ఏదో పాట పాడుకుంటూ ఉంది, కానీ అది ఆమె "అయ్యో, అయ్యో," పాట కాదు. దాంతో యెగార్ తలుపు దగ్గర ఉండగానే, "టీనా, నాకు ఆరు రూబుళ్లు కావాలి. నోనా యురీవ్నా కోసం కొంత కలప తీసుకోవాలి," అన్న మాటలు ఎలాగో అనేసాడు.

ఆ తరువాత ఏం జరుగుతుందో అతడికి తెలుసు. ఆమె తిన్నగా అయిపోతుంది, కళ్లు తడారిపోతాయి, చేతులకు ఉన్న నురగను తుడిచేసుకుంటుంది, ఛాతీ నిండా ఊపిరి తీసుకుంటుంది – అన్నివైపులా నాలుగిళ్ల అవతలి వరకు వినపడేలా అరవటం మొదలుపెడుతుంది. ఆమె అరుపులకు సిద్ధంగా ఉన్నాడు, అయినా వాటిని పట్టించుకోకుండా అరుపుల మధ్య ఊపిరి తీసుకోటానికి ఆగినప్పుడు నోనా యురీవ్నా ఎవరో, ఏది ఏమైనా ఆమెకు ఎందుకు సహాయం చెయ్యాలో చెప్పటానికి అతడు తయారవుతున్నాడు. అలాగే జరుగుతుందని అతడికి ఎంత నమ్మకంగా ఉందంటే ఆమె మాట్లాడిన మాటలు మొదట అతడికి ఏమాత్రం అర్థం కాలేదు.

"అవి మంచివేనా, కలపచెక్కలు?"

"ఏమిటి?"

"అంతా మోసగాళ్లే: నీకు పుచ్చిపోయిన చెక్కలు అంటగట్టకుండా ఉంటే చాలు."

"ఏమిటి?"

నీలి నరాలతో ఉన్న తన పెద్ద, పెద్ద చేతులను గౌను అంచుకు తుడుచుకుని మేరీ మాత పటం (తన తల్లి దీవెన) వెనకనున్న డబ్బా తీసింది.

"ఆరు సరిపోతాయా?"

"అంతకే ఒప్పందం కుదుర్చుకున్నాం."

"కారో, బండో బాడుగకి తీసుకోవాల్సి రావచ్చు."

అలాగంటూ ఆమె మరో మూడు రూబుళ్లు ఇచ్చింది. ఆ తరువాత ఆమె నిట్టూర్చి, బట్టలుతికే పనికి వెళ్లిపోయింది. యెగార్ డబ్బువంక చూసాడు. ఉన్నట్టుండి ఎప్పటిమాదిరి అతడి

పొట్ట ఖాళీగా అయినట్టు, లుంగచుట్టుకని పోతున్నట్టు నొప్పి పుట్టసాగింది. ఆ డబ్బు వంక చూసి, గుటక వేసి ఆరు రూబుళ్లు మాత్రమే తీసుకున్నాడు.

“వాటిని నేనే చేరవేస్తాను.”

అలాగంటూ అతడు అక్కడినుంచి బయలుదేరాడు. ఆమె వెనక్కి కూడా తిరిగి చూడలేదు: కొత్త పాట ఏదో మొదలుపెట్టింది. ఈసారి స్వరం కొంచెం పెద్దగా ఉందంతే. కాపలా మనిషికి ఒక సీసా, మూడు రూబుళ్ల డబ్బు ఇచ్చేటప్పుడు యెగార్ ఎండకు పాలిపోయిన తన కనుబొమ్మలను ముడివేసి అతడికి చేతనైనంత కఠినంగా, “మోసం చెయ్యవు కదా?” అన్నాడు.

“ఎవరిని?” కాపలా వ్యక్తి చాలా బద్ధకంగా బదులిచ్చాడు. “జమా, ఖర్చులు చూసే వ్యక్తి వెళ్లిపోయాడు, సంచాలకుడు కూడా వెళ్లిపోయాడు. అటువంటప్పుడు నేనిచ్చిన మాటను తప్పుతానా? అర్థంలేదు. నీకిచ్చిన మాట తప్పుతానా? దాంట్లోనూ అర్థం లేదు: అలా చేస్తే నువ్వు మళ్లీ రావు.”

“సరే. ఈ రాత్రికి: మూడవ పలక. నిద్దరమత్తులో తుపాకి పేల్చేవు సుమా.”

“తుపాకీలో గుళ్లు ఎక్కించి లేవులే.”

ఆ సాయంత్రం యెగార్ రెండు నిమిషాలపాటు కూడా కుదురుగా కూర్చుండలేకపోయాడు: వెళ్లాల్సిన సమయం ఇంకా కాకపోయినా ప్రతి రెండు నిమిషాలకు లేచి ఎటో ఒకవైపుకి పరిగెత్తేవాడు. తాను తీసుకున్న చొరవకీ, కుదుర్చుకున్న ఒప్పందానికి అతడికి ఎంతో గర్వంగా ఉంది. అయితే, ఆ గర్వం పక్కనే ఎక్కడో ఒక నల్లటి జలగ కూడా కదులుతోంది. యెగార్ బలహీన ప్రదేశం నుంచి రక్తం పీల్చటానికి అది తల ఎత్తి సిద్ధమవుతోంది. దాంతో అతడు గెంతి అటూ, ఇటూ పరిగెత్తేవాడు. దొంగతనానికి సమయం దగ్గర పడుతున్న కొద్దీ ఆ జలగ తల ఎత్తటం ఎక్కువవుతోంది, దాంతో యెగార్ మరింత ఆందోళనగా, మరింత వేగంగా పరుగులేత్తేవాడు.

ఆ కలపకి మద్యం సీసాలలో కాకుండా వాటికి అసలైన విలువ చెల్లించి ఉంటే బాగుండేది. తన హృదయం చుట్టూ తిరుగుతున్న జలగను భరించటంకన్నా తన ఆఖరి బూట్ల జత అమ్మేసి కలపకి పూర్తి ధర చెల్లించి ఉండాల్సింది. అయితే అది ఆచరణ సాధ్యం కాని విషయం అని అతడికి తెలుసు. యెగార్ ‘విలువైన’ బూట్లు కొనేవాళ్లు ఎవరూ లేకపోవటమే కాదు. ఆ కార్యాలయానికి ప్రైవేటు వ్యక్తులకు ‘మిగిలిపోయిన’ కలప మాత్రమే అమ్మే అధికారం ఉంది – ఆకారం, నాణ్యత

సరిగా లేనివాటినే అది స్థానికులకు అమ్ముతుంది. ఎంతో పనితనం చూపించి వాటితో కోళ్లగూడు మాత్రమే కట్టుకోవచ్చు. కాబట్టి వెనుతిరిగి చూస్తే యెగార్ ఆలోచనలన్నీ — ఇటువంటి ఆలోచనలు అతడికి ఎక్కువ — ఒకరంకంగా సైద్ధాంతికమైనవి మాత్రమే అని చెప్పవచ్చు. అక్కడ ఆచరణీయ పద్ధతి ఒక్కటే ఉంది: మూలనుంచి నాలుగో స్తంభం దగ్గర మూడో పలకగుండా లోపలకి వెళ్లటం.

సైద్ధాంతిక విషయాల గురించి యెగార్ ఎంత ఆందోళనగా ఉన్నా, లేదా ఆ కారణంగానేనో తన ఈ రాత్రి వ్యవహారానికి కోల్కాని తీసుకెళ్లదలుచుకోలేదు, అతడికి ఒక్కమాట కూడా చెప్పలేదు. ఆ విషయం గురించి ఎవరికీ చెప్పవద్దని హారిటీనాని కూడా ఆదేశించాడు. అయితే ఆమెకి ఇదేమీ చెప్పాల్సిన పనిలేదు. అతడు చెప్పకముందే, "నేను కోల్కాను పంపించను," అని ప్రకటించింది.

"అదే సరయ్యింది, టీనా. స్వచ్ఛమైన కన్నుల పిల్లవాడు..." ఉన్నట్టుండి యెగార్ గొంతు పూడుకుపోయింది. చివరికి, "దేవుడు మంచివాడు!" అనిమాత్రం గుసగుసగా అనగలిగాడు.

యెగార్ని సాహసికుడు అని అనటానికి లేదు గానీ అతడు దేనికీ భయపడడు కూడా. అతడు ఎలుగ్గొడ్డులను వేటాడాడు, మునిగిపోతున్నవాళ్లను కాపాడుతూ తాను మునిగిపోయినంత పనిచేశాడు, తాగి కొట్టుకుంటున్నవాళ్లను వేరు చేసాడు, కుక్కలను శాంతపరిచాడు. "చేసితీరాలి" అన్న పదం గతంలోనే కాదు ఇప్పటికి కూడా ఆతడికి చాలా ముఖ్యమైనది. ఆ పదం — అతడి అంతరాత్మలోంచి కానీ, బయటనుంచి కానీ — ఎప్పుడు వినిపించినా అతడిలోని మెతకతనం, బలహీనత, భయం వెనక్కితగ్గేవి. చేసి తీరాల్సిందేదో చేసి వస్తాడు. అందులో భయమూ ఉండదు, ఆర్భాటమూ ఉండదు.

ఇక్కడ కూడా "చేసితీరాలి" అన్నది బలంగా వినిపిస్తున్నప్పటికీ, ఏ కారణం చేతనో భయం తగ్గటం లేదు. నిర్దేశిత సమయం దగ్గరపడుతున్న కొద్దీ దారితెన్నూ లేని వింతైన భయం అతడిలో దడదడమంటూ కొట్టుకుంటోంది. దానిని తగ్గించటానికి, చీకటి రాత్రిలోకి కాలుపెట్టే ధైర్యం కూడగట్టుకోటానికి హారిటీనా గదిలోంచి బయటకు వెళ్లేవరకు యెగార్ వేచి ఉండి ప్రతిమ ముందు ఇబ్బందిగా, హడావిడిగా మూడుసార్లు శిలువ గుర్తు వేసుకున్నాడు. ఆ తరువాత అర్థంలేకుండా గుసగుసలాడాడు, "ప్రభువా, నేను నిజంగా దొంగతనం చెయ్యటంలేదు, శాశ్వత అప్పుగా తీసుకుంటున్నాను. ఈ ఒక్కసారి తప్పించి ఇటువంటి పని మళ్లీ చెయ్యనని ఒట్టేస్తున్నాను.

స్వర్గలోకపు రాణీ, నాకు అనుమతి ఇవ్వు. అన్యధా భావించకు... ఇదంతా ఒక మంచి మనిషికోసం చేస్తున్నాను."

ఆ సమయంలో హారిటీనా గదిలోకి రావటంతో అతడు తన ప్రార్ధనను అంతటితో ముగించాల్సివచ్చింది. దాంతో యెగార్ ఇంకా ఇబ్బంది పెడుతున్న అంతరాత్మతోనే దొంగతనానికి బయలుదేరాడు.

ఆ పనికి ఎంచుకున్న సమయం అర్థరాత్రి పన్నెండు గంటలు, దొంగతనానికి సరిగ్గా సరిపోయే సమయం. అప్పుడప్పుడూ మొరిగే ఒక కుక్కను మినహాయించి ఊరంతా నిశ్శబ్దంగా ఉంది. అందరూ శాశ్వత నిద్రలో ఉన్నట్టు ఒక్క ప్రాణి కూడా లేదు.

ఆ స్తంభాన్ని దాటుకుంటూ అతడు ఆరుసార్లు నడిచాడు, ఆరుసార్లూ అతడి గుండె ఆగిపోయింది: అది పట్టుబడతానన్న భయంతో కాదు, అతడు హద్దులు దాటుతున్నాడు. శిక్ష పడుతుందేమో అన్నదానికంటే పరిధి దాటుతున్నందుకు అతడి అంతరాత్మ వందరెట్లు వేదనపడుతోంది.

కలప దొడ్డినుంచి నోనా యురీవ్నా ఇంటివరకూ ఎనిమిది వందల గజాల దూరం ఆ కలపచెక్కలను ఎలా చేరవేశాడో అతడికి తెలియదు. ఆ తరువాత ఎంత ప్రయత్నించినా ఆ విషయం అతడికి గుర్తురాలేదు. ఇరవై అంగుళాల మందం ఉండి ఆరు గజాల పొడవున్న కలప చెక్కలను ఎలా చేరవేశాడో అతడికే అర్థం కాలేదు. ఎన్నిసార్లు తిరగాడో కూడా అతడికి గుర్తులేదు. ఒక్కసారికి మూడు చెక్కలకంటే ఎక్కువ మొయ్యటానికి ప్రయత్నించి ఆ పని లేకపోయాడన్నది తెలుసు.

కలపదొడ్డి దగ్గర ఒక్కరు కూడా లేరన్నది మాత్రం అతడికి గుర్తుంది. ఇరవై కాక రెండింతలు తీసుకున్నా అడ్డుచెప్పేవాళ్లు ఎవ్వరూ లేరు. కానీ వాళ్లు అనుకున్నట్టు సరిగ్గా ఇరవై చెక్కలు మాత్రమే తీసుకున్నాడు. వాటిని నోనా యురీవ్నా దొడ్డిలో ముందుగానే అతడు ఎంచుకున్న ప్రదేశంలో పడేసి ఇంటికి వెళ్లాడు. ఆపాటికి అతడు పూర్తిగా అలసిపోయాడు.

ఆ మరునాడు – అది చక్కటి ఆదివారం! యెగార్ మంచి చొక్కా వేసుకుని, తన గొడ్డలి తీసుకుని కోల్కాతో నోనా యురీవ్నా ఇంటికి బయలుదేరాడు. తాను సాధించిన దానిపట్ల అతడికెంత సంతోషంగా ఉందంటే దారిలో ఎదురైన ప్రతి ఒక్కరిని ఆపి మాట్లాడసాగాడు. యెగార్

పోలుష్కిన్ పనికి ఎవరూ అంత ప్రాధాన్యతను ఇవ్వరు. కానీ, యెగారే సంభాషణను తన పనివైపుకి మళ్లించేవాడు.

"పుట్టకొక్కుల కోసం వెళుతున్నావా! ఎంత అదృష్టం. సరదాగా వెళ్లిరండి. నామటుకు నాకు ఇవ్వాళ పని ఉంది. చాలా మూఖ్యమైన పని."

కోల్కా ఏం మాట్లాడకుండా నిట్టూర్చాడు. కుక్కపిల్ల ప్రాణానికి బదులుగా తన దిక్సూచిని ఇచ్చిన తరువాత అతడు అంతగా మాట్లాడటం లేదు. అయితే యెగార్ తన పనిలో మునిగి ఉండటం వల్ల కోల్కా మౌనాన్ని గుర్తించలేదు, అర్థంచేసుకోలేదు. ఇది తూతూమంత్రం పనికాదు, అసలైన వడ్రంగం, అంతరాత్మ కోసం చేస్తున్న పని. అందుకే అతడు చిల్లర మల్లర పనులకు తనతోపాటు ఎప్పుడూ కోల్కాని తీసుకెళ్లలేదు. ఆ పనులలో అతడు నేర్చుకోటానికి ఏముంది? బాగా డబ్బు సంపాదించటం ఎలాగో నేర్చుకుంటాడా? కానీ ఈసారి తీసుకెళుతున్నాడు. ఇప్పుడు వాళ్లు చెయ్యబోతున్నది నిజమైన పని, కాబట్టి నేర్చుకునేది కూడా విలువైనదిగా ఉంటుంది.

"ఎప్పుడు పనిచేసినా చికాకు పడుతూ చెయ్యకూడదు. నీ అంతరాత్మ ప్రకారం పనిచెయ్యి: దానికి సరైనదేమిటో తెలుసు."

"ఎప్పుడూ ఆత్మ అంటూ మాట్లాడతావేమిటి, నాన్నా? ఆత్మ అనేది లేదని మాకు బడిలో చెప్పారు, ఉండేవి అన్నీ కేవలం అసంకల్పిత ప్రతిస్పందనలే."

"కేవలం ఏమిటి?"

"అసంకల్పిత ప్రతిస్పందనలు. నీకు తెలుసు కదా – మనకి ఏదైనా తినాలనిపించినప్పుడు మన నోరు ఊరుతుంది."

"నీకు మంచి విషయాలే చెబుతున్నారు," ఒక క్షణంపాటు ఆలోచించి చెప్పాడు యెగార్. "నీకు ఏదైనా చెయ్యాలని లేదనుకో, అప్పుడేమవుతుంది? నీకు చెయ్యాలని లేనిది చెయ్యమని ఆదేశమిచ్చినప్పుడు నువ్వు ఏడుస్తావు, కొడుకా, కన్నీళ్లు ధారకడతాయి. ఆ కన్నీళ్లు నీ బుగ్గల మీదగా కారవు, నీ లోపల ఉంటాయి. అవి మండుతూ ఉంటాయి. ఏడుస్తున్నది నీ అంతరాత్మ కాబట్టి అవి మండుతూ ఉంటాయి. అంటే అంతరాత్మ ఉందన్నమాట. అయితే ప్రతి ఒక్కరికి తనదైన అంతరాత్మ ఉంటుంది. అందుకే ఎవరికి వాళ్లు తమ అంతరాత్మను వినగలగాలి. అది చెప్పేదేదో వినాలి."

వాళ్లు పనిచేసుకుంటూ, పని గురించి, పలికే మాటల గురించి ఆలోచిస్తూ మాట్లాడుకుంటున్నారు కాబట్టి ఎక్కడా తొందరపాటుతనం, హడావిడి లేవు. అవసరమైనప్పుడు కోల్కా సహాయం చేసేవాడు, రంపంతో కొయ్యవలసినవి కోసేవాడు. రెండు దెబ్బల్లో మేకుని లోపలికల్లా దిగగొట్టటం నేర్చుకున్నాడు. మొదటి దెబ్బ మేకు సరైన దిశలో కుదురుకునేలా జాగ్రత్తగా వేసేవాడు, ఒక్క ఊపుతో వేసే రెండవ దెబ్బకి మేకు చివరికల్లా దిగబడిపోయేది. ఇద్దరూ కలిసి చాలా బాగా పనిచేసారు: పైకప్పు కారకుండా చేసారు, వసారా దూలం సరిచేసారు, గచ్చు బాగు చేసారు. పుస్తకాలు నేలమీద ఎక్కడంటే అక్కడ పడిఉండకుండా మిగిలిన కలపతో యెగార్ పుస్తకాల అర ఒకటి చేయసాగాడు. ఆ పుస్తకాలలో స్థానిక అమెరికావాసుల పుస్తకం కూడా ఉండటంతో అతడి శ్రద్ధ మరింత పెరిగింది.

నాన్న పక్కనే కోల్కా ఉన్నాడు. తాను చెయ్యగలిగింది చేస్తూ, నేర్చుకోవలసింది నేర్చుకుంటూ చాలా కష్టపడ్డాడు. కానీ రోజుకొక్కసారి మాత్రం తప్పనిసరిగా రెండుగంటలపాటు మాయమై తిరిగి వచ్చేటప్పటికి చాలా విచారంగా ఉండేవాడు. యెగార్ ఆ విషాదాన్ని గమనించి, అతడిని పరికించి చూసాడు కానీ ఎటువంటి ప్రశ్నలు అడగలేదు: కోల్కా స్వతంత్ర బాలుడు, ఏది చెప్పాలో, ఏది దాచుకోవాలో అతడే నిర్ణయించుకోగలడు. కాబట్టి యెగార్ ఇతర విషయాలపై చర్చ ఉండేట్టు చూసేవాడు.

“అన్నింటికంటే ముఖ్యమైన విషయమేమిటంటే కొడుకా, నీ పనిలో ఎప్పుడూ నీకు ఆనందం దొరకాలి. పని పూర్తి కావటంతో నీకు పాట పాడాలనిపించాలి. దీంట్లో ఒక చిన్న కిటుకు ఉంది: నువ్వుఎంత ఆనందంతో పాడితే అంత ఆనందమూ తిరిగి నీ దగ్గరకు వస్తుంది. అంతేకాదు నీ పనిని చూసిన ప్రతి ఒక్కరికీ కూడా పాట పాడాలనిపిస్తుంది.”

“అలాగైతే ప్రతి ఒక్కరి నోరు తెరుచుకుని ఉంటుంది.”

ఆ రోజుకి మాయమై తిరిగివచ్చేటప్పటకి కోల్కా కోపంగా ఉన్నాడు, అతడి మాటలు కూడా కోపంగా ఉన్నాయి.

“కాదు కొడుకా, అది సరికాదు. మాంసంలేని పులుసైనా సంతోషమనే గరిటతో తింటే సంతృప్తిని ఇస్తుంది.”

“పులుసులో మాంసమంటూ ఉంటే నాకు గరిట లేకపోయినా పర్వాలేదు.”

"పొట్టకి సంతృప్తినిచ్చేది ఉంటుంది, ఆత్మకి సంతృప్తినిచ్చేది ఉంటుంది, కోల్కా."

"అదిగో మళ్లీ ఆత్మ అంటూ మొదలుపెట్టావు!" కోల్కా కోపంతో మండిపడ్డాడు. "ఆత్మల గురించి, మతం గురించి మాట్లాడుతూ ఉంటే సంభాషణ కొనసాగించటం ఎట్లా!"

వాళ్లు నోనా యురీవ్నా గదిలో పుస్తకాల అరకి చెక్కను చిత్రీ పడుతున్నారు. ఆమె వాళ్ల సంభషణలో జోక్యం చేసుకోలేదు, కానీ ఆమె అదంతా శ్రద్ధగా వింటోంది. ఆ సంభాషణకి కంటే ఆమె శ్రద్ధగా వినటానికి యెగార్ ఎక్కువ విలువనిచ్చాడు. ఆ కారణం వల్ల కోల్కా ఆ మాటలన్నప్పుడు అతడు చిత్రిక పక్కన పెట్టి పొగాకు తీసుకుంటూ ఆమెవైపు చూసాడు. ఆందోళనతో కూడిన అతడి చూపులకు నోనా యురీవ్నా అనుకోకుండా కల్పించుకుంటూ, "బహుశ మతం గురించి కాదేమో కోల్కా, విశ్వాసం గురించేమో?" అంది.

"విశ్వాసమేమిటి?"

"సరిగ్గా చెప్పావు, నోనా యురీవ్నా," అన్నాడు యెగార్. "తన శ్రమ ప్రజలకు సంతోషాన్ని ఇస్తుందన్న నమ్మకం ప్రతి వ్యక్తికి ఉండాలి. అలాకాకుండా పనిచేసేది డబ్బుకోసమే అయితే, ఇవ్వాళ తవ్వు, రేపు పూడ్చు అయితే అది నీకు ఆనందాన్ని ఇవ్వదు, ప్రజలకు సంతోషాన్ని ఇవ్వదు. నీకు తృప్తినిచ్చేలా పని జరిగిందా అని కాకుండా పొద్దెక్కడ ఉంది, అది ఇంకెంత సేపటికి కుంగుతుంది, ఈ వ్యధ ఎప్పుడు ముగుస్తుంది అని చూస్తూ ఉన్నావనుకో. ఆ రోజు గడిచిన తరువాత నీ ఆత్మ నీకు గుర్తుకు వస్తుంది. నీలో ఉన్నది సిగ్గూ ఎగ్గూ లేని ఎడ్డి మడ్డి పనివాడు కాకుండా అసలైన పనిమంతుడు ఇంకా బతికి ఉంటే ఆత్మ తప్పకుండా గుర్తుకొస్తుంది. అసలైన పనిమంతుడు!"

ఉన్నట్టుండి యెగార్ గొంతుక పూడుకుపోయి, గాద్గదికమైపోయింది. అతడు చుట్ట చుట్టుకోటానికి ప్రయత్నిస్తున్నాడు కానీ అతడి చేతులు అందుకు సహకరించటంలేదు.

"నువ్వు చుట్ట ఇక్కడే కాల్చుకోవచ్చు, యెగార్ సవెలిచ్," అంది నోనా యురీవ్నా.

ఆమెను చూసి యెగార్ నవ్వాడు. అతడి పెదాలు వణికాయి.

"అదీ విషయం, నోనా యురీవ్నా."

అంతసేపు కోల్కా ఏమీ మాట్లాడకుండా ఉన్నాడు. ఏమీ మాట్లాడకుండా, కోపంగా చూస్తూ ఉన్నాడు. కానీ ఉన్నట్టుండి, "కుక్కపిల్లకు రోజుకి ఎన్నిసార్లు ఆహారం పెట్టాలి, నోనా యురీవ్నా?" అని అడిగాడు.

"పిల్లలకా?" ఒక్కసారిగా ఆ ప్రశ్నకి ఆమె తడబడింది. "ఏం పిల్లలు?"

"చిన్న కుక్కపిల్లలు," కోల్కా వివరించాడు.

"నాకు – నాకు తెలియదు," ఆమె బదులిచ్చింది. "బహుశ –"

ఆ సమయంలో తలుపు మీద ఎవరో కొట్టిన శబ్దం అయ్యింది. అది అరచేతితో కొట్టిన శబ్దం కాక పట్టణంలోమాదిరి వేలి కణుపులతో కొట్టిన శబ్దం. ఈ శబ్దంతో నోనా యురీవ్నా మరింత తడబాటుకి లోనయ్యింది.

"ఎవరది? లోపలిక రండి!"

కొత్త అటవీ వార్డెను యూరి పెట్రోవిచ్ చువలోవ్ లోపలికి వచ్చాడు.

*రచయిత స్వగతం*

*నేను ఇక్కడ ఆపి ఉండవలసింది: మిగిలింది పాఠకులు ఊహించుకుని ఉండేవాళ్లు. వాళ్లు సంతోషకరమైన ముగింపు ఇచ్చి ఈ పుస్తకాన్ని పక్కన పడేసి ఉండేవాళ్లు. ఇది చదివి వాళ్లు ఆవలించి కూడా ఉండవచ్చు. అయితే వాళ్లు నన్ను మన్నించి ఉండేవాళ్లు:సుఖాంతాలు ఎప్పుడూ ఇష్టంగా ఉంటాయి, ఇష్టంగా ఉన్నవాళ్లకి మన్నించేయటం కష్టం కాదు.*

*కానీ యెగార్ మాత్రం నన్ను మన్నించడు. ఆకాశం మాదిరి మెరుస్తున్న కళ్లతో మౌనంగా నన్ను చూస్తూ ఉంటాడు. ఆ కళ్లల్లో ఖండన లేదు, దూషణ లేదు, కోపం లేదు: నిరసన మాత్రమే ఉంది.*

*అందుకే దీనిని కొనసాగిస్తున్నాను. నేను మొదలుపెట్టిన పాటని చివరికంటా పాడాలి.*

***(తరువాయి భాగం వచ్చే వారం)***

For Latest Telugu Books - Visit now:
Kinige.com